పొదరింట ప్రభుత్వ కార్యాలయాలు



తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పెరిగిన తుప్పలు

- పొదలు, తుప్పలతో తప్పని తిప్పలు
- ఒకే ఆవరణలో మూడు శాఖల కార్యాలయాలు
- నిర్వహణ, సమన్వయ లోపంతో సమస్య
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

సామర్లకోట: ప్రజా సంబంధమైన ఆ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఓ చిట్టడవిని దాటి వెళ్లాల్సిందే. నిర్వహణ లోపం కొంత, అశ్రద్ధ మరి కొంత ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్, మండల విద్యాశాఖ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సహజంగానే ఇవి ప్రజలతో రద్దీగానే ఉంటాయి. ఎంపీడీఓ కార్యాలయానికి ఆ ఆవరణలోనే నూతన భవనం నిర్మించడంతో, పిఠాపురం రోడ్డులో ఇరుకు భవనంలో ఉంటున్న రెవెన్యూ కార్యాలయాన్ని ఖాళీ అయిన ఎంపీడీఓ కార్యాలయానికి మార్చారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలో మండల విద్యాశాఖ కార్యాలయం కూడా ఉంది.

తుప్పలతో తిప్పలు

తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో తుప్పలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. వర్షాకాలంలో అయితే క్రిములు, కీటకాలు పెరిగి, అడపాదడపా పాములు తారసపడుతుండడంతో ప్రజలు, సిబ్బంది భయపడుతున్నారు. విద్యాశాఖ కార్యాలయం వద్ద సైతం తుప్పలు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తల్లికి వందనం పథకం అమలు కోసం తల్లిదండ్రులు, వివిధ పనులపై మండలంలోని 75 పాఠశాలల హెచ్ఎంలు ఇక్కడకు తరచుగా వస్తుంటారు. ఇక్కడి పరిస్థితి చూసి వారు భీతిల్లుతున్నారు.



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం

ఆవరణను శుభ్రంగా ఉంచాలి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెరిగిపోయిన తుప్పలను తొలగించాలి. వర్షాల వల్ల అక్కడి వాతావరణంతో అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు తల్లికి వందనం అందక పోవడంతో అనేక మంది తరుచూ విద్యాశాఖ కార్యాలయానికి వస్తున్నారు.

– బాలం శ్రీనివాసు, సీపీఎం కార్యదర్శి, సామర్లకోట

పాములు వస్తున్నాయి



తుప్పలు బాగా పెరగడం వల్ల మండల విద్యాశాఖ కార్యాలయంలోకి పాములు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న తుప్పలను తొలగించాలి. తమ కార్యాలయ ఆవరణను నిత్యం శుభ్రంగా ఉంచుతున్నాం. తహసీల్దార్‌కు తుప్పల వల్ల ఎదురయ్యే సమస్యను వివరిస్తాం.

– పి. పుల్లయ్య, మండల విద్యాశాఖాధికారి 2, సామర్లకోట

ఆకతాయిలకు పోలీసుల చెక్



సామర్లకోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పెద్దాపురం ఎస్సై సురేష్

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద పేట్రేగిపోతున్న ఆకతాయిలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు తమ స్వగ్రామాలకు వెళ్లడానికి ఆలయం వద్ద బస్సుల కోసం వేచి ఉంటారు. ఆ సమయంలో కొంత మంది ఆకతాయిలు మోటారు సైకిళ్లపై తిరుగుతూ ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. దాంతో ఆకతాయిలు అటుగా రావడానికి భయపడి వెనక్కు మళ్లుతున్నారు. ఈ తనిఖీలు నిత్యం ఉండాలని స్థానికులు కోరుతున్నారు. సరిహద్దు తగాదా పెట్టుకుంటూ ఆలయ ప్రాంతం మీదంటే మీదని సామర్లకోట, పెద్దాపురం పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి పద్మనాభానికి నివాళి



పంతం పద్మనాభం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దాపురం: మాజీ మంత్రి పంతం పద్మనాభానికి మండలంలోని కాండ్రకోట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. 25వ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి పంతం పద్మనాభం విగ్రహానికి జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా రామస్వామి, జోకా నానాజీ, గవరసాని రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించిన ఘనత పంతం పద్మనాభానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భద్రరావు, ఆలయ చైర్మన్ గవరసాని వీరస్వామి, ఒబిలిశెట్టి వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీ చికిత్స విధానాలను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహం అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యాశాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతులైన విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అక్కడి విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీని, అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చౌదరి, శర్మ, భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుమార షష్ఠి



పంచారామ క్షేత్రంలోని కుమారస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలోని కుమార స్వామి ఆలయంలో శుక్రవారం కుమార షష్ఠి వేడుకలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాగా 14వ తేదీన ఆలయంలో వేంచేసి ఉన్న మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని ఈఓ తెలిపారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఏసీటీ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన విదేశీ ప్రతినిధులు



ప్రయోగాలను పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

పెద్దాపురం: స్థానిక రామారావుపేటలో అల్లం రాజు చారిటబుల్ ట్రస్ట్ (ఏసీటీ) శిక్షణ కేంద్రంలో కియా అసోసియేషన్ సంస్థ ప్రతినిధి బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సైన్స్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం విదేశీ ప్రతినిధులు పరిశీలించినట్లు శ్రీనివాస్ తెలిపారు. నెదర్లాండ్స్‌కు చెందిన యోస్టగైర్, ఇమ్మిస్మిత్‌తో పాటు కిరణ్ మధునాపంతుల బృందం పరిశీలించి ప్రతి వారం ఉచితంగా సైన్స్ శిక్షణ తగరతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కియ కార్యదర్శి జగన్నాథం, పీసీసీ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, పూజిత, సూర్యశ్రీ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం'పై అవగాహన పెరగాలి

- ఎంఈఓ శివరామకృష్ణయ్య



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ మధ్యాహ్న భోజన పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య సూచించారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి విద్యార్థీ తీసుకునేలా తల్లిదండ్రుల సమావేశంలో చర్చించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాసి రకంగా ఉంటే విద్యార్థులు తమకు తెలియజేయాలన్నారు. భోజనం అందజేసే సంస్థ రుచికరంగా పెట్టకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతి రోజూ భోజనం రుచి చూడాలన్నారు. వారి వెంట హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఉన్నారు.

కరప పాఠశాల తనిఖీ..

స్థానిక కరప చెరువు వద్ద ఉన్న ఎలిమెంటరీ పాఠశాలను ఎంఈఓ–2 పి పుల్లయ్య శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. వంద శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకునేలా చూడాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

12,850 మందికి కౌలు కార్డులు



గోర్సలో రైతులకు కౌలు కార్డులు అందిస్తున్న అధికారులు

కొత్తపల్లి: నియోజకవర్గంలో ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నాయి. కాగా ఈ ఏడాది నియోజకవర్గంలో 12850 మంది రైతులకు కౌలు కార్డులు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ స్వాతి తెలిపారు. మండలంలోని గోర్స రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇప్పటివరకూ 3312 మందికి కౌలు కార్డులు అందించామన్నారు. మిగిలిన వారికి వారం రోజుల్లో కార్డుల అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 41,680 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుందని చెప్పారు. కాలువల నుంచి నీరు విడుదల కావడంతో రైతులు సాగు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గొల్లప్రోలు మండలంలో 2500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేస్తున్నట్టు చెప్పారు. 250 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. నియోజకవర్గపరిధిలో 65 రైతు సేవా కేంద్రాల్లోనూ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు పాల్గొన్నారు.

ప్రజలకు స్టాప్ డయేరియాపై అవగాహన



చిన జగ్గంపేటలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



పాఠశాలలో విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానం వివరిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: గ్రామాల్లో స్టాప్ డయేరియాపై అవగాహన క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో సచివాలయాల వారీగా అంగన్‌వాడీ పాఠశాలల్లో శుక్రవారం వైద్యారోగ్య సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. డయేరియా సోకిన పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబెట్లు 14 రోజుల పాటు ఇచ్చి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశాలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు

- కమిషనర్ వెంకటరావు హెచ్చరిక
- నిర్మాణం తొలగింపు పర్యవేక్షణ

కాకినాడ: కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు హెచ్చరించారు. స్థానిక జయేంద్ర నగర్ ప్రాంతంలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి చేసిన నిర్మాణాన్ని కమిషనర్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంక్రోచ్‌మెంట్ చట్టం ప్రకారం కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేయడం నేరమన్నారు. అటువంటి వ్యక్తులు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఆక్రమణలు తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్పొరేషన్ తరఫున ఆక్రమణలను తొలగించే క్రమంలో జరిగే నష్టాలకు యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే మున్సిపల్ స్థలాల్లోని ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

కొన్ని ఖాళీ స్థలాల్లో చెత్త, నిలువ నీరు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని తక్షణమే తొలగించాల్సిందిగా ఆయా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ వెంకటరావు తెలిపారు. స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల దోమల వృద్ధి చెంది ప్రజారోగ్యానికి ఇబ్బందిగా మారుతున్నాయని, అనేక సీజనల్ వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ఈ విషయంలో స్థల యజమానులు స్పందించకపోతే జరిమానాలు విధించడంతో పాటు ఆయ స్థలాల్లోని చెత్తను నగరపాలక సంస్థ తరఫున తొలగించి అందుకు అయ్యే ఖర్చును వారి నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, ఆయా సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ దేవి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక మాండవ్యనారాయణస్వామి దేవేరి లక్ష్మీదేవి గ్రామోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరను పురస్కరించుకుని తెల్లవారు జామున పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పారిశ్రామిక వేత్త బిక్కిన సాయి దంపతులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘురామ్, శేషుబాబు, రవికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి అమ్మవారిని గజ వాహనంపై ఊరేగించారు. కాలిబాట వంతెన, ప్లె ఓవర్, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్ద వీధి, యార్లగడ్డవారి వీధి, మఠంసెంటర్, కొత్తూరు మీదుగా రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరింది.

చురుగ్గా గుర్రపు డెక్క తొలగింపు



పీబీసీలో గుర్రపు డెక్క తొలగిస్తున్న జేసీబీ

సామర్లకోట: పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం ఈ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. సామర్లకోట ఐదు తూముల వద్ద నుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు నీరు వెళ్తుంది. ఇప్పటికే పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదల జాప్యం కావడం, వచ్చిన నీరు శివారు ప్రాంతాలకు అందకపోవడంతో ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క తొలగింపు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. శుక్రవారం ఈ పనులను ఇరిగేషన్ ఏఈ ఎం. శివకృష్ణ పరిశీలించారు. గుర్రపు డెక్క తొల గింపుతో శివారు భూములకు నీరు అందుతుందని ఆయన చెప్పారు.

నేడు మండల సమావేశం

పెద్దాపురం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఉషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటకు ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన సమావేశం ఉంటుందని, మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

సిరిధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి

కిర్లంపూడి: సిరిధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ వ్యవసాయ సంయుక్త సహాయకులు ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిరిధాన్యాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమీకృత వ్యవసాయ విధానం వల్ల తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు పండించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అర్హులందరికీ కౌలుకార్డులు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఏ హరి, ఏడీఏ దైవకుమార్, ఏఓ జోకాఅమృత తదితరులు పాల్గొన్నారు.

17న మరిడమ్మతల్లి జాతర

తుని రూరల్: ఎస్.అన్నవరంలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై కొలువైన మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి గురువారం ఉదయం వరకూ జాతర నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలరాతి చక్రరావు, కార్యదర్శి కీర్తి నాగేశ్వరరావు, కోశాధికారి మోకిన సురేష్ తెలిపారు. 18న తీర్థం నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు. గ్రామంలో అష్టాదశ (18) శక్తి పీఠాలు ఒకేచోట కొలువైన ఏకైక ఆలయం ఇదే అన్నారు. జాతర, తీర్థం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అమ్మవారి జాతర, తీర్థంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఖాళీ కంచాలతో కార్మికుల నిరసన



రాక్ సిరామిక్స్ ఎదురుగా ఖాళీ కంచాలతో ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు శుక్రవారం ఖాళీ కంచాలతో తమ నిరసనను తెలిపారు. కార్మికులను తొలగించి 88 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదని కార్మిక నాయకుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జాయింట్ లేబర్ కమిషన్ వద్ద ఐదోసారి జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయని తెలిపారు. తమకు సీఐటీయూ అండగా ఉండటం వల్లే ధైర్యంగా ఉన్నామని కార్మికులు తెలిపారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, కార్మికులు గంగాధర్, సతీష్, రామకృష్ణ, మల్లికార్జునరావు, వరప్రసాద్, క్రాంతి, అర్జునరావు, సత్యనారాయణ, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలు భద్రం

- డీఎస్పీ లతాకుమారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: రోడ్డు ప్రమాదాలపై యువత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు అధ్యక్షతన ట్రాఫిక్ నియమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు యువత హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. తద్వారా ప్రమాదాలు తప్పించుకోవచ్చు అన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే మృతి చెందుతున్నారన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్, న్యాయవాదులు బాపూజీ, దుర్గాప్రసాద్, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, లక్ష్మి, కళాశాల ఏఓ సందీప్, పెద్దకాపు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



వాకతిప్పలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

కొత్తపల్లి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్లు సారమ్మ, అనంతలక్ష్మి, సుజాత పేర్కొన్నారు. మండలంలోని వాకతిప్పలో ప్రజలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు, చట్టాలను వివరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సుష్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమన్నారు. పని వద్దు – బడిముద్దు నినాదంతో పిల్లలను చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, రాజ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణ ప్రసాద్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారూ.. ఇదేం పనితీరు !



పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులోని గోర్స జంక్షన్ సమీపంలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేశారు. ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న పైపులైన్ నుంచి నీరు లీకవ్వడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. దీనిలో భాగంగా గొయ్యి తీశారు. పైపులైను మరమ్మతుల చేపట్టినప్పటికీ గొయ్యిని పూడ్చలేదు. ఈ గొయ్యి రోడ్డ మధ్యలో ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరిగినా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తమకేమీ పట్టనట్లుగానే వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.